# విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కార్యాలయము

**పత్రికా ప్రకటన** **తేది.19.06.2018.**

# సాయిబాబా గుడిలో దొంగతనానికి పాల్పడిన నిందితుడు అరెస్ట్

## *రెండు పంచలోహ విగ్రహాలు మరియు రూ.10 వేల నగదు స్వాధీనం*

నగర పోలీస్ కమీషనర్ శ్రీ డి.గౌతం సవాంగ్ ఐపిఎస్ గారి ఆదేశాలపై విజయవాడ నగరంలో వివిధ నేరాల నియంత్రణ మరియు నేరస్థుల కథలికలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసిన సిసిఎస్ పోలీసులు దొంగతనాలు నియంత్రణ నిమిత్తం పోలీసు గస్తీని ముమ్మరం చేయడంతో పాటు అంతర్ జిల్లా, అంతర్ రాష్ట్ర నేరస్థులు, జైలు నుండి విడుదలైన నేరస్తులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికపై నిఘా ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ నేపథ్యంలో ది.19.06.2018న సిసిఎస్ పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు విజయవాడ రైల్వేస్టేషన్ కాల్‌టెక్స్ రోడ్డ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించడం జరిగింది. విచారణలో కంకిపాడు పోలీస్‌స్టేషన్ పరిధి తేన్నేరు గ్రామంలో సాయిబాబా గుడిలో చోరీ చేసినట్లు వెల్లడైన నేపథ్యంలో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. అలాగే అతని వద్ద నుండి గుడిలో చోరీకి చేసిన **రంగనాథస్వామి పంచలోహ విగ్రహం, గోదాదేవి పంచలోహ విక్రహంతో పాటు రూ.10 వేల నగదు** స్వాధీనం చేసుకోవడం జరిగింది.

తూర్పుగోదావరి జిల్లా మాచవరం గ్రామానికి చెందిన **తల్లప్రగడ ఏసునాగ శ్రీనివాస్ అలియాస్ వై.ఎన్.శ్రీనివాస్ (22)** ఐటిఐ వరకు చదివి మానేశాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఒక మోటారు కంపెనీలో పని చేస్తున్న శ్రీనివాస్ చెడు అలవాట్లకులోనై జల్సాలు చేయడానికి వచ్చే ఆదాయం చాలకపోవడంతో దొంగతనాలు చేసి సులువుగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో కంకిపాడు మండలం, తెన్నేరు గ్రామంలో ఉంటున్న తన తాతయ్య మరియు బాబాయి ఇంటికి రెండు నెలల క్రితం శ్రీనివాస్ వచ్చాడు. శ్రీనివాస్ తాత గారు మరియు బాబాయిలు తెన్నేరు సాయిబాబా గుడిలో అర్చకత్వం పని చేస్తారు. ఈ క్రమంలో తెన్నేరులో స్థానికంగా ఉంటున్న 17 సంవత్సరాల బాలుడితో శ్రీనివాస్‌కు పరిచయం ఏర్పడింది. జల్సాలు చేయడానికి శ్రీనివాస్ వద్ద డబ్బు లేకపోవడంతో దొంగతనం చేయాలని నిర్ణయించుకుని అందుకు తన తాతయ్య మరియు బాబాయిలు అర్చకత్వం చేసే సాయిబాబా గుడిని ఎంచుకున్నాడు. తన మిత్రుడు మైనర్ బాలుడిని కలుపుకుని ది.27.05.2018న మధ్యాహ్నం సమయంలో సాయిబాబా గుడి వద్దకు ఇద్దరు చేరుకుని, గుడి ప్రక్కనున్న తలుపులు పగులగొట్టి ఇద్దరు లోనికి ప్రవేశించారు. అనంతరం గుడిలో ఉన్న కొంద నగదు మరియు రెండు పంచలోహ విగ్రహాలు దొంగిలించి అక్కడి నుండి పారిపోవడం జరిగింది.

జరిగిన దొంగతనం గురించి కంకిపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా తదుపరి దర్యాప్తు నిమిత్తం ఈ కేసును సిసిఎస్ పోలీసు వారికి బదిలీ చేయడం జరిగింది. ఈ కేసును క్షుణ్ణంగా అన్ని కోణాల్లో విచారించిన సిసిఎస్ పోలీసులు నిఘా ఏర్పాటు చేసి, ది.19.06.2018న విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలో గుడిలో దొంగతనానికి పాల్పడిన **తల్లప్రగడ ఏసునాగ శ్రీనివాస్ అలియాస్ వై.ఎన్.శ్రీనివాస్ (22)** అదుపులోకి తీసుకోవడంతో పాటు అతని వద్ద నుండి రెండు పంచలోహ విగ్రహాలు మరియు రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకోవడం జరిగింది.

-- xx --